క్లుప్తంగా

స్వయం సహాయక సంఘాలకు రుణాలు



మాట్లాడుతున్న ప్రసాదరావు

ఇచ్ఛాపురం రూరల్: అర్హత గల స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, సీఐఎఫ్ వంటి రుణాలు అందజేస్తున్నట్టు వెలుగు ఏపీఎం సనపల ప్రసాదరావు చెప్పారు. స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో వీవోఏలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంఘం ఎంబీకే వంద శాతం ఉండడంతోపాటు సంఘం 'ఏ' గ్రేడులో ఉండేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. చిరుధాన్యాల ఉత్పత్తి, వినియోగం, పెరటితోటల పెంపకంపై మహిళా సంఘాలు ఆసక్తి కనబర్చి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. సమావేశంలో స్త్రీనిధి మేనేజర్ కె.రాము, సీసీలు రామకృష్ణ, మోహనరావు పాల్గొన్నారు.

నేడు కవిటి మండల సర్వసభ్య సమావేశం

కవిటి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ కడియాల పద్మ అధ్యక్షతన ఆదివారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో పి.సూర్యనారాయణ శనివారం తెలిపారు. అన్నిశాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలన్నారు.

దిశ యాప్‌పై అవగాహన



మాట్లాడుతున్న కవిత

కోటబొమ్మాళి: దిశ యాప్ మహిళలకు అండగా ఉంటుందని శ్రీకాకుళం ఒన్‌స్టాప్ సెంటర్ ప్రతినిధి కవిత అన్నారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో శనివారం దిశ యాప్ వినియోగం, మహిళలు ఆపద సమయంలో తనకుతాను రక్షించుకోవడం ఎలా, మహిళా చట్టాలు గురించి డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించారు. సమావేశంలో ఏపీఎం కె.రాము, సీసీలు రామక్రిష్ణ, ఆదినారాయణ, ఎంఎంఎస్ అధ్యక్షురాలు బింగు లక్ష్మి పాల్గొన్నారు.

లింగనిర్ధారణ పరీక్షలు నేరం



కొజ్జీరియాలో మాట్లాడుతున్న డాక్టర్ రాకేష్.

కవిటి: గర్భస్థ లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని ఆర్.బెలగాం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రాకేష్ అన్నారు. కొత్తకొజ్జీరియా, ఆర్.అగ్రహారం తదితర గ్రామాల్లో గర్భస్థ లింగనిర్ధారణ అంశంపై శనివారం అవగాహన సదస్సులు నిర్వహించి మాట్లాడారు. గర్భస్థ లింగనిర్ధారణ పరీక్షలు వైద్యపరమైన ప్రయోజనాల కోసమే చేయాలి తప్పించి పుట్టబోయే బిడ్డ ఆడా, మగా అని నిర్ధారణ చేయడానికి వీలులేదని కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్ మాదిన కృష్ణారావు,హెల్త్ ఎడ్యుకేటర్ మంగమ్మ అన్నారు. కార్యక్రమంలో ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటినుంచి అసిరి పోలమ్మతల్లి సంబరాలు

నందిగాం: హరిదాసుపురం గ్రామ దేవత అసిరిపోలమ్మతల్లి సిరిమాను సంబరాలు ఆదివారం నుంచి మూడు రోజులు పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి జరిపే ఈ ఉత్సవం గతంలో 2003లో జరిపారు. తర్వాత 2013లో అనివార్య కారణాల వలన జరగక పోవడంతో 20 సంవత్సరాలకు ఈ ఏడాది నిర్వహిస్తున్నారు. బంధువులు, దూరప్రాంతాల్లో ఉన్నవారు గ్రామానికి చేరుకున్నారు.

పాలిసెట్‌లో విద్యార్థుల ప్రతిభ

టెక్కలి: పాలిసెట్ ఫలితాల్లో టెక్కలి మండలానికి చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ చూపారు. మెరుగైన ర్యాంకులతో మెరిశారు. వారాడ యామిని 221వ ర్యాంకు, కొప్పల స్వాతి 2,790, సత్తారు భార్గవ్ 3,182, వాకాడ మణికంఠ 3,342, దుంపల హేమిని 3,351, కర్రి జ్యోత్స్న 3,847, లక్కోజు వైష్ణవి 4,168, తెప్పల మౌనిక 4,284, కొన్ని రాంప్రసాద్ 4,492, తెంబూరు ఉదయ్‌కిరణ్ 4,528, ధర్మాన సేవిత 4,552, గొల్లవలస ప్రవీణ్ 5,906 ర్యాంకులను సాధించారు.

డీఎల్‌పీవోను కలిసిన వార్డు సభ్యులు

టెక్కలి: టెక్కలి డీఎల్‌పీవోగా బాధ్యతలు చేపట్టిన ఐ.వి.రమణను పట్టణానికి చెందిన పలువురు వార్డు సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ని దుశ్శాలువతో సత్కరించారు. డీఎల్‌పీవోను కలిసిన వారిలో వార్డు సభ్యులు డి.పోలయ్య, ఎస్.రాజేశ్వరరావు, ఎ.రవికుమార్, టి.లోకేశ్వరరావు, నాయకులు జి.అప్పలరెడ్డి, డి.శ్రీను, ఎ.రాహుల్, దుర్గాప్రసాద్ ఉన్నారు.

వలంటీర్లు సంక్షేమ సారథులు

- వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఎమ్మెల్సీ రామారావు, సమన్వయకర్త సాయిరాజ్



ఇచ్ఛాపురం రూరల్: వలంటీర్లను అవార్డులతో సత్కరిస్తున్న ఎమ్మెల్సీ రామారావు, సమన్వయకర్త సాయిరాజ్

ఇచ్ఛాపురం రూరల్: వలంటీర్లు పేదలకు సేవ చేస్తున్న సంక్షేమ సారథులని ఎమ్మెల్సీ నర్తు రామారావు, వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ కొనియాడారు. పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వలంటీర్లు సేవా భావంతో కులం, మతం, ప్రాంతం చూడకుండా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. వలంటీర్లు ప్రభుత్వ ఉద్యోగులు కారని, స్వచ్ఛందంగా మంచి చేయాలనే మనస్సు పెట్టి అడుగులు వేస్తూ 25 రకాల పథకాలకు బ్రాండ్ అంబాసిడర్లని అన్నారు. ఎంపీడీవో కె.రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్‌పర్సన్ సల్ల సుగుణ, సీడాప్ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ డి.లోకేశ్వరరావురెడ్డి, ఇచ్ఛాపురం, కంచిలి ఎంపీపీలు బోర పుష్ప, పైలా దేవదాసురెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి, వైస్ ఎంపీపీ దున్న గురుమూర్తి, ఎంపీడీవో కె.రామారావు, నాలుగు మండలాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో ఐదు మంది వలంటీర్లకు వజ్ర, పాతిక మందికి సేవా రత్న అవార్డులు, ప్రశంసా పత్రాలు అందజేసి దుశ్శాలువలతో సత్కరించారు.

ఇచ్ఛాపురం రూరల్: ప్రతి ఇంటికి వెళ్లి సామాజిక బాధ్యతతో ప్రజలకు, ప్రభుత్వానికి వారధిలా నిలుస్తున్న వలంటీర్లు సేవాతత్పరులని ఎంపీపీ బోర పుష్ప అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా అరకబద్ర, టి.బరంపురం గ్రామ సచివాలయాల్లో వలంటీర్లను ఘనంగా సత్కరించారు. మెడల్స్, ప్రశంసా పత్రాలతో పాటు దుశ్శాలువతో సత్కరించారు. మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, సర్పంచ్ కారంగి త్రినాథ్‌రెడ్డి, రంగాల కృష్ణారెడ్డి, సచివాలయం కన్వీనర్ మంగి హేమావతి, బింగి నీలాద్రి, కార్యదర్శి సవర కృష్ణ, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

కవిటి: గ్రామవలంటీర్లు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆకాంక్షలను నెరవేర్చేలా ఉన్నతమైన సేవలతో ముందుకు సాగాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. శిలగాం, లండారపుట్టుగ గ్రామసచివాలయాల్లో సేవామిత్ర అవార్డులకు ఎంపికైన పలువురు గ్రామవలంటీర్లను ప్రభుత్వ ఆదేశాలమేరకు సత్కరించారు. ఎంపీపీ కడియాల పద్మ, ఎంపీడీవో పి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలం లఖందిడ్డి–1(గంగరాం) సచివాలయంలో ఎంపీపీ రోణంకి ఉమ, ఎంపీడీవో నిశ్చల ఆధ్వర్యంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. గంగరాం, లఖందిడ్డి–2, యలమంచిలి సచివాలయాల పరిధిలోని 30 మంది వలంటీర్లను దుశ్శాలువలతో సన్మానించి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు రోణంకి మల్లయ్య, జిల్లా రైతు సమాఖ్య సభ్యుడు కవిటి రామరాజు, సర్పంచులు బమ్మిడి గణపతి, పేడాడ వెంకటరావు, ఎంపీటీసీ సభ్యుడు హనుమంతు గోవిందరావు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: భావనపాడు పంచాయతీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వలంటీర్లను ఘనంగా సన్మానించారు. భావనపాడు సచివాలయ పరిధిలో ఉన్న 20 మంది వలంటీర్లలో సేవామిత్ర అవార్డుకు ఎంపికైన 18 మందికి సత్కరించారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బి.మోహనరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు బి.రాజ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పి.మేనకేతన రెడ్డి, ఈవోపీఆర్డీ శశిభూషణరావు, సచివాలయం వీఆర్వో ఉమాపతి ఉన్నారు.



ఇచ్ఛాపురం రూరల్: అరకబద్రలో వలంటీర్ల సత్కారంలో ఎంపీపీ పుష్ప



కాశీబుగ్గ: వార్డు వలంటీర్లను సత్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ గిరిబాబు, అధికారులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న వార్డు వాలంటీర్లను ఒకటో వార్డు పరిధిలో ఉన్న మొగలిపాడు సచివాలయంలో శనివారం సత్కరించారు. మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు 16 మంది వలంటీర్లను దుశ్శాలువతో సత్కరించి ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ దున్న నిర్మల, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి దున్న సత్యం, కో–ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్, మున్సిపల్ కమిషనర్ సీతారాం, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



కవిటి: శిలగాం సచివాలయంలో గ్రామవలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ రామారావు, ఎంపీపీ కడియాల పద్మ



కోటబొమ్మాళి: గంగరాంలో వలంటీర్లను సత్కరిస్తున్న దృశ్యం



సంతబొమ్మాళి: సేవకులను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

అందరి సహకారంతో గ్రామదేవత ఉత్సవాలు

- మంత్రి అప్పలరాజు



మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

మందస: మందస గ్రామదేవత ఉత్సవాలకు అందరి సహకారం అవసరమని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. ఈ నెల 28 నుంచి జూన్ ఆరో తేదీ వరకు జరగనున్న ఉత్సవాలపై చర్చించేందుకు అధికారులు, మందస పెద్దలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజుల కాలం నుంచి గ్రామదేవత అన్నపూర్ణమ్మతల్లి ఉత్సవాలు ఘనంగా జరుగుతుండేవన్నారు. ప్రస్తుతం కూడా అదేస్థాయిలో సంబరాలను నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. రక్షణ, పారిశుద్ధ్యం, ఇతర సమస్యల్లేకుండా అధికారులు చక్కని ప్రణాళికలు వేసుకుని, ఉత్సవాలను విజయవంతం చేయడానికి కృషి చేయాలన్నారు. అనంతరం ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. తహసీల్దార్ బడే పాపారావు, ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు, ఎస్సై వై.రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్‌శాఖల ఏఈలు ప్రసన్నకుమార్, ఎల్.యోగి, పంచాయతీ ఈవో ఏవీ సత్యన్నారాయణ, సర్పంచ్ చెరుకుపల్లి యల్లమ్మ, లక్ష్మణమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు కంచిబెహరా, ఉపసర్పంచ్ జీఐగ భైరాగి, వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామపెద్దలు గిన్ని తిరుపతిరెడ్డి, వి.వి.రమణమూర్తి, శానాపతి కిశోర్‌కుమార్, సిందిరి జగన్, దువ్వు జగదీష్, రాజాన మహేశ్, ఇప్పిలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బలహీనవర్గాలను కించపరచడం తగదు



నిరసన ర్యాలీలో మాట్లాడుతున్న సాయిరాజ్

సోంపేట: పేదలకు ఇచ్చే సెంటు భూమి శవం పూడ్చడానికి సరిపోతుందంటూ చంద్రబాబు వ్యాఖ్యానించడం తగదని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. చంద్రబాబు అహంకారపూరిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ చెప్పారు. బాబు వ్యాఖ్యలను ఖండిస్తూ కొర్లాం గ్రామంలో శనివారం సాయంత్రం ఎమ్మెల్సీ నర్తు రామారావుతో కలిసి నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సాయిరాజ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సుఖంగా జీవించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారన్నారు. వారి జీవన ప్రమాణాల స్థాయి పెరిగేలా పరిపాలన చేస్తున్నారన్నారు. ప్రతి పేదవాడి సొంతింటి కలను నెరవేరుస్తున్నారన్నారు. పేదవాడు బాగుంటే చూడలేని చంద్రబాబు నిత్యం కుట్రలు చేస్తూ దుర్మార్గ ప్రచారాలు చేస్తున్నారన్నారు. అమరావతిలో పేదవాడు నివాసం ఉండకూడదని కోర్టుకి వెళ్లిన నీచుడు చంద్రబాబని మండిపడ్డారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దక్కత లోకేశ్వర్‌రెడ్డి, సీడాప్ చైర్మన్ శ్యాంప్రసాద్ రెడ్డి, సోంపేట, కంచిలి ఎంపీపీలు నిమ్మన దాస్, పైల దేవదాస్‌రెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం


వజ్రపుకొత్తూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో సైతం మౌలిక సదుపాయాలు కల్పించడమే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసరావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ అన్నారు. నువ్వలరేవు గ్రామంలో జల జీవన్ మిషన్‌లో భాగంగా సుమారు రూ.86 లక్షలతో చేపడుతున్న ఇంటింటికీ మంచినీటి కుళాయి పథకం పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికే ఉద్దాన ప్రాంతంలో రూ.700 కోట్ల వ్యయంతో చేపడుతున్న మేగా వాటర్ స్కీం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పి.దుర్యోధన, బెనర్జీ, వైఎస్సార్‌సీపీ నాయకులు మువ్వల దేవా, మువ్వల యజ్ఞా, బి.త్రినాథ్, బి.రామక్రిష్ణ, సొసైటీ అధ్యక్షుడు బైనపల్లి నీలాంబర్ ఉన్నారు.



శంకుస్థాపన కార్యక్రమంలో నాయకులు

భయపెట్టిన గాలివాన

- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- తక్షణమే మేల్కొని మరమ్మతులు చేపట్టిన సిబ్బంది



కాశీబుగ్గ: అర్ధరాత్రి వేళ విద్యుత్ స్తంభంపై మరమ్మతులు చేపడుతున్న ఉద్యోగి



వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దాన ప్రాంతంలో నేల మట్టమైన అరటితోట

కాశీబుగ్గ/వజ్రపుకొత్తూరు రూరల్: పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో శుక్రవారం అర్ధరాతి గాలివాన అలజడి సృష్టించింది. భీకరమైన గాలుల తోపాటు వర్షం కురవడంతో ఏంజరుగుతుందో తెలియక జనం భయాందోళన చెందారు. చెట్టు కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో సరఫరాకు అంతరాయం కలిగింది. అయితే సిబ్బంది వెంటనే స్పందించి అర్ధరాత్రి తరువాత కూడా మరమ్మతులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించారు. పలాస మండలం బెండిగేటు, జగన్నాథసాగరం, ఉద్దానం, బ్రాహ్మణతర్లా, పలాస, కాశీబుగ్గ ప్రాంతాల్లో చెట్లు విద్యుత్ తీగలపై పడిపోవడంతో ఆ శాఖ అధికారులు అర్ధరాత్రి వరకు పనులు నిర్వహించినట్లు కాశీబుగ్గ ఏఈ నాగభూషణ్ తెలిపారు. వజ్రపుకొత్తూరు మండలంలో వీచిన భారీ గాలులకు పంటలకు నష్టం వాటిల్లింది. బైపల్లి, బాతుపురం, సీతాపురం, వజ్రపుకొత్తూరు, రాజాం, అక్కుపల్లి, డోకులపాడు, నగరంపల్లి తదితర గ్రామాల రైతుల జీవనాధారమైన మామిడి, మునగ, కొబ్బరి, అరటి పంటలకు కొంత మేర నష్టం వాటిల్లింది. మామిడి కాయలు నేలరాలడంతో నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గాలుల ప్రభావానికి నగరంపల్లి, బెండి, పూండిగల్లి తదితర ప్రాంతాల్లో విద్యుత్ తీగలు తెగి పడ్డాయి. చినవంక, బెండి, గరుడబద్ర తదితర ప్రాంతాల్లో చెట్లు విరిగి రోడ్లపై పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ ప్రారంభం

కాశీబుగ్గ: పురపాలక సంఘం పరిధిలో స్వచ్ఛ భారత్ మిషన్ 2.0, మేరా స్వచ్ఛ షహర్ కార్యక్రమంలో భాగంగా ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లను ఏర్పాటు చేశారు. కాశీబుగ్గలోని ఐడీఎస్‌ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్ సమీపంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, కమిషనర్ సీతారాం శుక్రవారం ప్రారంభించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవమైన జూన్ ఐదో తేదీ వరకు దీన్ని నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, సభ్యులు పర్యావరణ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దున్న నిర్మల, నాయకుడు సత్యం, కోఆప్షన్ సభ్యుడు బమ్మిడి సంతోష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్.వి.శివలక్ష్మి పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న చైర్మన్ గిరిబాబు తదితరులు

ఆహార పొట్లాల పంపిణీ



యాచకులకు ఆహార పొట్లాలు అందజేస్తున్న అభిమానులు



టెక్కలి: రక్తదానం చేస్తున్న అభిమానులు

ఇచ్ఛాపురం రూరల్: సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదినం సందర్భంగా ఆయన అభిమానులు శనివారం సేవా కార్యక్రమాలు చేపట్టారు. అభిమాన సంఘం అధ్యక్షుడు కొర్రాయి రమేష్ ఆధ్వర్యంలో స్వేచ్ఛావతి, ధనరాజులమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి యాచకులకు ఆహార పొట్లాలు అందజేశారు.

టీమ్ తారక్ ట్రస్టు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

టెక్కలి: సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదినం సందర్భంగా టెక్కలిలో టీమ్ తారక్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లా కోఆర్డినేటర్ దాలిశెట్టి భాస్కర్ ఆధ్వర్యంలో 29 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం 500 మందికి అన్నదాన నిర్వహించారు. రక్తదానం చేసిన వారికి సుదర్శన్ థియేటర్ యజమాని సత్తారు వెంకటరమణ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వెంకి, నాయుడు, కిరణ్, రమణ, డిల్లీ, పవన్, సంతోష్ పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం



సంతోషికి సాయమందిస్తున్న దృశ్యం

మందస: మందస పట్టణంలోని ఎస్సీ (దండాసి) వీధికి చెందిన కొమ్మన సంతోషి కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడతుంది. ఉండడానికి ఇల్లు కూడా లేదు. దీంతో ఆ కుటుంబానికి దాతలు సాయం చేస్తున్నారు. కాశీబుగ్గకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎం.మల్లేశ్వరరావు సోదరుడు నరేంద్ర (చిన్ని)తో పాటు టి.శ్రీనివాసరెడ్డి సంతోషికి శనివారం రూ.10 వేలు అందజేసి అండగా నిలిచారు.

నీటి సౌకర్యానికి ప్రాధాన్యం



కంచిలి: వాటర్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

కంచిలి: నీటి సౌకర్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. బెల్లుపడ గ్రామంలో 15వ ఆర్థిక సంఘం మండల పరిషత్ నిధులు రూ. 2.4 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన బోరు, మూడు వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకు, ట్యాప్ సిస్టమ్‌లను స్థానిక సర్పంచ్ అయుధం జయరాం ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లడ్డుకేశవపాత్రో, జేసీఎస్ కన్వీనర్ కొణపల సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకుడు మెండ ప్రకాశ్, ఉపసర్పంచ్ డి.దాలిబంధు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

సోంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు చేరువవుతున్నాయని వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. కొర్లాం సచివాలయం పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ నర్తు రామారావుతో కలిసి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి కుటుంబం సంతోషంగా ఉండటమే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా వర్తించిన పథకాల ప్రయోజనాలు వివరించారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, సీడాప్ కార్పొరేషన్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, సోంపేట, కంచిలి ఎంపీపీలు నిమ్మన దాస్, పైల దేవదాస్‌రెడ్డి పాల్గొన్నారు.



సంక్షేమాన్ని వివరిస్తున్న సాయిరాజ్, నర్తు రామారావు

దేవతామూర్తుల విగ్రహాల నిమజ్జనం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం గ్రామదేవత ఉత్సవాలు ఇటీవల వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వివిధ దేవతామూర్తుల విగ్రహాలను పలు జంక్షన్లలో ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. ఉత్సవాలు నాలుగు రోజుల క్రితం ముగిశాయి. దీంతో దేవతామూర్తుల విగ్రహాల నిమజ్జన ప్రక్రియకు కమిటీ సభ్యులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా కార్జివీధి మండపం వద్ద ఏర్పాటు చేసిన గోవిందరాజుల విగ్రహాన్ని శనివారం ఊరేగింపుగా తీసుకొని వెళ్లి సముద్రంలో నిమజ్జనం చేశారు.



నిమజ్జనానికి తరలివెళ్తున్న గోవిందరాజుల విగ్రహం

కాంట్రాక్టర్‌పై కేసు నమోదు

కోటబొమ్మాళి: నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై షేక్ మహమ్మద్ అలి తెలిపారు. జాతీయ రహదారి మధ్యలో మొక్కలు నాటి వాటి పరిరక్షణకు కూలీలతో కాంట్రాక్టర్ పనులు చేయిస్తున్నారు. ఈ క్రమంలో రోజూ రోడ్డు మధ్యలో రహదారి నిరోధకాలు పెట్టి నిర్లక్ష్యంగా కూలీలతో పనులు చేపడుతుండడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడం, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నట్టు ఎస్సై చెప్పారు. దీనిపై కాంట్రాక్టర్‌ని పిలిపించి హెచ్చరించినా అతను పట్టించుకోలేదన్నారు. దీంతో అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి

వజ్రపుకొత్తూరు రూరల్: నువ్వలరేవు ఉప్పుటేరు వంతెన నిర్మాణ నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని గ్రామ పెద్దలతో పాటు బాధితులు కోరారు. గ్రామంలో శనివారం అధికారులు సమావేశం ఏర్పాటు చేశారు. అయితే గ్రామస్తులు, అధికారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కొంతమంది నిర్వాసితుల నుంచి పలు రకాల పత్రాలు అధికారులు వసూలు చేయడంతో మిగిలిన బాధితులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో వంతెన నిర్మాణానికి 104 ఇళ్లను తొలిగించాల్సి ఉందని అధికారులు నిర్ణయించి ఇంటి గోడలపై నంబర్లు వేశారని అందుకు అనుగుణంగా ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చిందని పలువురు సమావేశం దృష్టికి తెచ్చారు. అయితే నేడు రహస్యంగా పత్రాలు వసూళ్లు చేయడం అనుమానాలకు దారి తీస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా వంతెన నిర్మాణానికి మరోమారు అధికారులు సర్వే చేయాలని స్థానికులు కోరారు. గ్రామానికి వైఎస్సార్‌సీపీ నాయకులు పాలిన శ్రీనివాసరావు, ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ చేరుకొని బాధితులు, అధికారులతో మాట్లాడారు. బాధితులకు న్యాయం చేస్తామని ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరడంతో పరిస్థితి సద్దుమణిగింది.